ఏలూరు అభివృద్ధే వైఎస్సార్ సీపీ అజెండా

- 31, 32, 36 డివిజన్లలో రూ.2.16 కోట్లతో పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని





31వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, 32వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకంలో నడిపించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రధాన అజెండా అని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో శనివారం ఆయన మూడు డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 31, 32, 36 డివిజన్లలో అభివృద్ధి పనులకు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నాని శంకుస్థాపనలు చేశారు. 31వ డివిజన్‌లో రూ.90 లక్షల వ్యయంతో ఒక సీసీరోడ్డు, 20 సీసీ డ్రెయినేజీలు, 32వ డివిజన్‌లో రూ.96 లక్షల నిధులతో 5 సీసీ రోడ్లు, 22 సీసీ డ్రెయిన్లు, 36వ డివిజన్‌లో రూ.30 లక్షల వ్యయంతో 6 సీసీ రోడ్లు, ఒక కల్వర్టు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

పేద కుటుంబాల్లో వెలుగులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో పేద కుటుంబాల్లో వెలుగులు నింపటమే ప్రథమ కర్తవ్యంగా భావించారని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమాన్ని విస్మరించకుండా పథకాలను అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే కరోనా మహమ్మారి విజృంభించినప్పటికీ ప్రజల జీవనానికి అండగా నిలిచారని, మిగిలిన రెండున్నరేళ్ల కాలంలో అభివృద్ధిపై దృష్టి సారించారని వివరించారు. శనివారం నగరంలోని మూడు డివిజన్ల పరిధిలో రూ.2.16 కోట్లతో 12 రోడ్లు, 42 డ్రెయినేజీలు, ఒక కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. నగరంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టామని, అవన్నీ శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమాల్లో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు పోతర్లంక లక్ష్మణ్, బండారు సునీతారత్నకుమారి, భీమవరపు హేమసుందరి, పార్టీ నాయకులు బండారు కిరణ్‌కుమార్, పార్టీ క్లస్టర్-3 అధ్యక్షులు మంచెం మైబాబు, క్లస్టర్-1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, హీరో మోటార్స్ అధినేత సోమేశ్వరరావు, ప్రత్తిపాటి విక్టర్ బాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



36వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని

క్లుప్తంగా

రహదారి భద్రత నియమాలు తెలుసుకోవాలి



ఎంవీఐ ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను తెలుసుకోవాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు సీఆర్‌రెడ్డి అటానమస్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు వారు మరణిస్తుండటం బాధాకరమని ప్రసాద్ అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు సైన్లు, ట్రాఫిక్ లైట్లను అనుసరించడంతో పాటు ఒకే లైనును అనుసరించాలని, రహదారి కూడళ్లను దాటేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని సూచించారు. రోడ్డుకు ఎప్పుడు ఎడమవైపు ఫుట్‌పాత్ పైనే నడవాలని, రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాస్ వద్ద దాటడం చాల ఉత్తమమని, రోడ్డు దాటే సమయంలో ముందుగా కుడి వైపు చూస్తూ, ఆ తర్వాత ఎడమవైపు చూసి జాగ్రత్తగా రోడ్డును దాటడం మంచిదని చెప్పారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర సంస్థ యూత్ వాలంటీర్ పాయం సింధు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ఏలూరు(మెట్రో): ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు కోరారు. శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ చేపట్టిన కార్యక్రమంలో సంఘాల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లిని దర్శించుకున్న ఒంగోలు డీఎస్పీ



అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని దర్శించుకున్న డీఎస్పీ మేకా సుధాకర్ దంపతులు

దెందులూరు: ఒంగోలు డీఎస్పీ మేకా సుధాకర్ కుటుంబ సభ్యులు శనివారం గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు డీఎస్పీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం డీఎస్పీ సుధాకర్ మాట్లాడుతూ తమ కుటుంబంతో 26 ఏళ్లుగా ఏటా అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ



అడిషనల్ కమిషనర్ చంద్రయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామని ఏలూరు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ చంద్రయ్య హామీ ఇచ్చారని జోనల్ మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, సహాయ కార్యదర్శి ఎస్ఎం సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం అడిషనల్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్టు పేర్కొన్నారు. 2022 జూన్ నెల బకాయిలు రూ.50 లక్షలు, 1000 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.1000 చొప్పున ప్రభుత్వం ప్రకటించిన పండగ బోనస్ రూ.10 లక్షలు విడుదల చేయాలని కోరినట్టు తెలిపారు. అర్హులకు ప్రమోషన్స్ కల్పించాలని, ఏడుగురు ఎస్ఎంఆర్‌కు ప్రతినెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చంద్రయ్య హామీ ఇచ్చారని వివరించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ వహించాలి



శనివారపుపేటలో పాఠశాల పనితీరు పరిశీలిస్తున్న సోమశేఖర్

ఏలూరు రూరల్ : ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమగ్ర శిక్షా అభియాన్ అదనపు సమన్వయకర్త బి.సోమశేఖర్ అన్నారు. శనివారం ఆయన శనివారపుపేట జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జెడ్పీ పాఠశాలలో కొందరు విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయకపోవడాన్ని గమనించారు. పిల్లలందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. మండల పరిషత్ పాఠశాలలో స్మార్ట్ టీవీ బ్లాక్ బోర్డు తక్కువ ఎత్తులోకి మార్చాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం ప్రతి శనివారం చేపట్టే హోమ్ విజిట్‌ను పరిశీలించారు. రిసోర్స్ టీచర్ పనితీరు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. పిల్లలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కమిటీలు ఇవే

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఏలూరు నగర అనుబంధ విభాగాల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి..

ఏలూరు నగర వాణిజ్య కమిటీ:

అధ్యక్షుడు బుర్రంశెట్టి బ్రహ్మయ్య. ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ జైన్, బూర్లగడ్డ చినసుబ్బారావు. ప్రధాన కార్యదర్శులు కడియం చినసూర్యనారాయణ, ఎస్కే మరూఫ్, కడియం ప్రసాద్, దాయంత్రి శ్రీనివాస్, బొలిశెట్టి సురేష్‌కుమార్, గ్రంధి బదరి. సెక్రటరీలు తోలేటి రాజ్‌కుమార్, తాబేలు ఝాన్సీ, భజనపల్లి ధనుంజయ, మద్దుల యుగంధర్ శ్రీనివాస్, ప్రగడ దుర్గ, చుండూరి పూజి, సబ్బాని సారథి, తమ్మన రాంబాబు, కొనపరెడ్డి మహేష్‌బాబు, సందీప్‌సుభాష్ పాటిల్, కాశ్యప్ రాజు, కుప్పాల రాంబాబు. జాయింట్ సెక్రటరీలు తానంకి బాలు, నంబూరి వెంకన్న, పసలపూడి మాణిక్యాలరావు, కీశెట్టి ఈశ్వర వెంకట సత్యనారాయణ, కోలా రామ్‌గోపాల్, లక్కిశెట్టి సుబ్బారావు, గుర్రం దుర్గారావు, ఒబిలిశెట్టి బాబురావు, షేక్ సాధిక్, చింతలపూడి నాగవెంకట రత్నం, మయూరి శ్రీనివాస్, కీర్తి జైన్.

చేనేత కమిటీ:

అధ్యక్షుడు కొల్లిపాక సురేష్‌బాబు. ఉపాధ్యక్షులు మడ మల్లికార్జునరావు, అల్లం జయ్‌దేవ్, ప్రధాన కార్యదర్శులు దొడ్డి నాగేశ్వరరావు, కసనం మధు, నార్ని అనిల్, వీరా రమేష్, శాలా ప్రకాష్. సెక్రటరీలు యడబత్తుల శేఖర్, ఎ.నాగమల్లిబాబు, నిల్లా నాగేశ్వరరావు, రొబ్బి సత్యనారాయణ, బోశెట్టి ముత్యాలరావు, పేరిశెట్టి శ్యామలరావు, మొగడాల లోకేష్, మోరా భాస్కరరావు, పదం రాము, బూరిడి చిన్ని. జాయింట్ సెక్రటరీలు గుత్తి బసవేశ్వరరావు, చిట్యాల ఠాకూరు, బనిశెట్టి పూర్ణ, సూరిశెట్టి ఉదయ్‌భాస్కర్, నెల్లి ప్రకాష్, పృథ్వీ రామ నాగేంద్రరావు, ఇండవ ఈశ్వరరావు, కప్పా త్రినాథ్, అల్లం మను, బోశెట్టి గణేష్.

వైఎస్సార్ సేవాదళ్ కమిటీ:

అధ్యక్షుడు యల్లాపు మోజెస్. ఉపాధ్యక్షులు అయ్యంకి రాజు, పఠాన్ మహ్మద్‌ఖాన్. ప్రధాన కార్యదర్శులు తూతా భాస్కరరావు, బొండాడ హర్షవర్ధన్, తలారి లక్ష్మణరావు, కొమ్మిన అనిల్, విడుతూరి రవికుమార్, అంగడాల శివ. సెక్రటరీలు బూరగ భరత్ కుమార్, షేక్ కాపర్, మోర్ల మణికంఠ, మకటం సాయికుమార్, చేపల అనిల్‌కుమార్, ఆకునూరి వరుణ్, నాకా దినేష్, వి.చిట్టి, బుడిరాతి శ్రీనివాస్, మల్లవరపు ఏసుబాబు, సీహెచ్ పూజి, పాము శ్యామ్, ఎస్కే యాసీన్.

ట్రేడ్ యూనియన్ కమిటీ:

అధ్యక్షుడు లంకపల్లి వెంకట గణేష్. ఉపాధ్యక్షులు భారతి వెంకట్రావు, షేక్ షమ్మి, ప్రధాన కార్యదర్శులు పూనూరి నాగేశ్వరరావు, పోతురాజుల రాము, ఎండీ షఫీ, పామర్తి సీతారామయ్య, కిలారపు పాండురంగారావు, పి.అప్పారావు. సెక్రటరీలు పోలా అనిల్‌కుమార్, తావంకి సుందరం, రాళ్లపల్లి రవికుమార్, బత్తిన మురళీకృష్ణ, కొమ్మిన అబ్రహాం, రావూరి శివ, బాలిశెట్టి సత్యనారాయణ, పెయ్యిల హరీష్‌బాబు, బొగడ దుర్గా, శివలంక గంగాభవాని, శ్రీరామ సాయికుమారి. జాయింట్ సెక్రటరీలు గంటా బాబ్జి, రెడ్డి వంశీమోహన్, షేక్ సలీమ్, కెల్లా అప్పలాచారి, ఆరిమిల్లి వెంకన్న, పోలా డేవిడ్, నల్లా దుర్గారావు, టేకు బ్రహ్మం, బళ్లా సూర్యనాగేశ్వరరావు, కారంశెట్టి సుబ్బారావు, సూరిశెట్టి వీరస్వామి, ఎండీ షానూముసా షరీఫ్.

విద్యార్థి కమిటీ:

అధ్యక్షుడు ఏలూరు ఆంజనేయులు. ఉపాధ్యక్షులు వంజరపు ఠాగూర్, షేక్ షరీఫ్. ప్రధాన కార్యదర్శులు రాచేటి అజయ్, చాబత్తుల వైవిధ్య, పూసర్ల పోలు, దేవరపల్లి జాన్‌పాల్, పసల దుర్గా ప్రసాద్, జంగంశెట్టి రోహిత్. సెక్రటరీలు గండికోట గణేష్, పి.యుగంధర్, ఎస్కే బాషా, ఎస్ రాజేశ్వరి, సీహెచ్ రాజేశ్వరి, యారగంటి రాజ్‌కుమార్, బీశెట్టి చందన్, సరిక దినేష్, పి.యోహాన్, ఇ.భార్గవి, కె.సాల్మన్ రాజు. జాయింట్ సెక్రటరీలు ఎస్ లావణ్య, టి.తులసి, వీఎస్‌వీ గణేష్, పి.భాస్కర్, జె.రవికుమార్, సీహెచ్ సునీల్ కుమార్, ఇందు ప్రియ, పి.హేమంత్, కొడాలి శివ, ఎం వెంకటసాయి, పి.దీపక్, ఎ.బాషా.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు



పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలందరికీ ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం పోతునూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్ని అమలు చేసిన గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మహిళా ప్రాధాన్యత లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. స్వయం ఉపాధి, కుటుంబ అభివృద్ధి, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి సంస్కరణలు చేపడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు వివక్షకు తావులేకుండా అందాలన్న ఆశయంతో పని చేస్తున్నారని తెలిపారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి, భద్రతకు, భవిష్యత్తుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారన్నారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మహిళలందరి కోసం పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. అనంతరం మండలంలో 1,456 స్వయం సహాయక సంఘాల్లోని 14,560 మంది మహిళలకు రూ.17.34 కోట్ల ఆసరా చెక్కును అందజేశారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయం

రైతు భరోసా భవనాలు, సచివాలయ వ్యవస్థ, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ ద్వారా దేశమంతా ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకునే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. పోతునూరులో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యేతో కలిసి వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీఎం వేణుగోపాల్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, కామిరెడ్డి నాని, పార్టీ ఏలూరు మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచ్ బోదుల స్వరూప్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దోసపాడులో ఉప్పుల అగస్టీన్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. అగస్టీన్ భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 06, 07
బెండకాయలు	40	కంద	56
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-50	కీరా దోస	34
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	60
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30-36	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20-22	గోంగూర	08
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	28-36	బఠాణి	--
అనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	--
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	05
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత



కొప్పులవారిగూడెంలో నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందిస్తున్న గౌడ సేవా సమితి సభ్యులు

పెదవేగి : ఏలూరు గౌడ సేవా సమితి తరఫున పెదవేగి మండలం. కొప్పుల వారి గూడెంకి చెందిన మరీదు స్వాతి, మట్టా లక్ష్మి పేద గౌడ కుటుంబాలకు చేయూత కార్యక్రమం ద్వారా సాయం అందించినట్టు సంస్థ జనరల్ సెక్రటరీ, న్యాయవాది బైగాని రంగారావు తెలిపారు. ఏలూరు గౌడ సేవా సమితి తరఫున వీరికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, కొత్త బట్టలు, మిక్సీలు రూ.6 వేల నగదు అందజేశారు. ఈ సంస్థను పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన ఎన్నారై మోదుగుముడి రాజశేఖర్ 2022లో స్థాపించారని అప్పటి నుంచి 40 పేద కుటుంబాలకు చేయూత కార్యక్రమాన్ని అమలు చేశామని రంగారావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్లు బొమ్మగాని బాలకృష్ణ, మారగాని శ్రీనివాస్, కామవరపు కోటకు చెందిన, పరస మోహన్, పరస నాగ శీను, కట్టా శ్రీనివాస్, వీరంకి అయ్యప్ప, నూతి రవీంద్ర, పరస శ్రీనివాసరావు, బైగాని భార్గవ్, సురగాని శ్రీనివాసరావు, మోదుగు మూడు వెంకట్ పాల్గొన్నారు.

పంచాయతీలకు డస్ట్‌బిన్ల అందజేత

పెదపాడు: ఆంధ్రా కార్పొరేషన్ ద్వారా అందించిన డస్ట్‌బిన్లు ప్రజలకు పంపిణీ చేయాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు డస్ట్‌బిన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ రత్నకుమారి మాట్లాడుతూ పెదపాడు మండలానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తడి, పొడి చెత్త సేకరణకు 20వేల డస్ట్‌బిన్లు అందించారు. వాటిని పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జే తేజరతన్, బత్తుల ఏసురాజు, చింతల శివయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి

భీమడోలు: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రభుత్వం బాధిత దళితులకు అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. కోరుకల్లు పంచాయతీ శివారు రత్నాపురంలో దళితుల భూవివాదంపై విక్టర్ ప్రసాద్ శనివారం సాయంత్రం సందర్శించారు. వివాదాస్పదమైన ఏడు ఎకరాల ఆక్వా చెరువు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో చైర్మన్ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఏలూరులోని పచ్చిపులుసు శివనారాయణకు తమకు చెందిన ఏడు ఎకరాల ఆక్వా చెరువును తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.84 లక్షల అప్పు తీసుకున్నామని, సదరు వ్యక్తి ఆ భూమిని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నాడని బాధితులు గుమ్మడి కనక శాంతిశ్రీ, గుమ్మడి రంజిత్ తెలిపారు. అప్పు తిరిగి చెల్లిస్తామని శివనారాయణకు చెప్పినా అధిక వడ్డీలు వేసి రూ.2 కోట్లు చెల్లించాలని చెప్పాడని గత్యంతరం లేని పరిస్థితిలో కమిషన్‌ను ఆశ్రయించామని వివరించారు. ఇటీవల ఆ భూమిని మరొకరికి శివనారాయణ విక్రయించాడని వాపోయారు. చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు నెలల క్రితమే బాధితులు కమిషన్‌ను ఆశ్రయించారన్నారు. బాధితుల ఆక్వా భూమిని శివనారాయణ ఉద్దేశ్యపూర్వకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అధిక వడ్డీల పేరుతో వారిని మానసికంగా ఇబ్బందులు గురి చేశాడని చెప్పారు. శివనారాయణ, అతని భార్యపై కాల్ మనీ కేసు నమోదు చేయాలన్నారు. వేరే వ్యక్తికి ఆ భూమిని విక్రయించడంతో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీలపై అన్యాయంగా దాడులు చేసినా, ఆస్తులను కబ్జాలు చేస్తే కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్కే ఖాజావలి, డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు, తహసీల్దార్ జి.వరహాలయ్య పాల్గొన్నారు.